# 2. సీతాపతి రావు

చదువుకునే రోజుల్నుంచే రాజకీయాలలో ఎక్కువ అభిరుచి గల సీతాపతిరావుకు ఒక్క పట్టాపొందాలంటే బ్రహ్మప్రయత్నం చేయవలసి వచ్చింది. ఐతే మాత్రం ఏమైంది? కలవారింటి అబ్బాయి కావడం చేత కూడు, గూడు, గుడ్డ అనే కనీసావసరాల కొరకు శ్రమించే పని లేదు. స్కూలు మరియు కాలేజి రోజులలో అతను ఒక రాజకీయ వాదిగా కాక ఒక రాజకీయ సిద్ధాంతవాదిగా పేరు సంపాదించాడు. ఒక సోక్రటీస్ గానీ, ప్లేటోగానీ, అరిస్టాటిల్ గానీ అవడానికి అతను ఎపుడూ ప్రయత్నించలేదు, ఒక కౌటిల్యుడు లేక మ్యాకిపెల్లీ వేషం కట్టడానికి అతనికి ఏ మాత్రం అభ్యంతరం ఉండేది కాదు. స్కూలు, కాలేజీల్లో జరిగే తగవులాటల్లో పాల్గొనడానికి ఇష్టంలేని సీతాపతికి పిల్లల మధ్య దెబ్బలాటలు, కొట్లాటలు ప్రేరేపించడానికి మాత్రం అసామాన్యమైన సామర్థ్యం ఉండేది. ఐతే నారుదుడికిచ్చిన చెడ్డపేరు ఇతనికి ఎవరూ ఆపాదించలేదు. సీతాపతితో పరిచయమున్న వారికి మాత్రం అతను ఒక శాంతిదూత మరియు సామరస్యప్రియుడు. అతనే కనుక ఏ ఇస్రాయేల్‌లోనో పాలస్తీనాలోనో పుట్టున్నట్టయితే, లోకశాంతికి, సామరస్యసాధనకి చెరో నోబెల్‌ప్రైజ్ వచ్చేసి ఉండేది.

పార్టీలోపలగానీ, పార్టీల మధ్యలోగానీ, ఉత్పన్నమయ్యే వైషమ్యాలను పరిష్కరించడానికి, ఉపాయాలకోసం విద్యార్థి నేతలు సీతాపతిని రహస్యంగా లేదా బహిరంగంగా సంప్రదించేవారు. అతని సంభాషణారీతి కొంతసేపు గమనించిన వాళ్ళు అతనిని ఒక గౌతమబుద్ధుడికీ, మహాత్మాగాంధీకి బ్రాండ్ న్యూమోడల్‌గా పరిగణిస్తారు. "ఒక చెంప చిదిమితే, రెండో చెంప చుంబించడమని చూపించే" గాంధేయ సిద్ధాంతం పట్ల సీతాపతికి విశ్వాసం లేదు. ఎంత సంక్లిష్ట సమస్యలకైనా రక్తపాతాల దాకా వెళ్ళకుండా, చిన్న తగవులకు మాత్రం పరిమితమయ్యేట్లు

పరిష్కార సూచనలు ఇచ్చే అతని పటిమ ఎంతో ప్రశస్తమైనది. ఒకవేళ ఏదైనా రక్తపాతం జరిగిందనే అనుకోండి, అది సీతాపతి కుతంత్రం వల్ల జరిగిందని ఎవరైనా అంటే జనం కుళ్లోడిన చెప్పులతో కొట్టేవారు. సీతాపతి ఉపదేశాలు సరియైన రీతిలో స్వీకరించి ఆయన సలహాలను అలాగే అమలుపరిస్తే అదిపెద్ద గొడవలకు దారితీయదని అందరూ అనుకుంటారు. అతను ఒక జిత్తులమారి నక్క అని ఎవరికీ అనుమానం అసలు కలగలేదు.

ఈ విధంగా పార్టీలో ఒక మామూలు కార్యకర్తలా కాకుండా, పార్టీలో ఉన్న అతి తక్కువ మంది బుద్ధి జీవులలో ఒకడుగా పురోగమిస్తూ ఉన్న సీతాపతికి పార్టీలో ఔద్యోగిక స్థానాలలో ప్రశస్తమైన రీతిలో ప్రవర్తించడం ఇష్టమే కాని ప్రభుత్వం కింద ఏదైనా చిన్న చిన్న పదవులను సంపాదించాలని ఉద్దేశం ఎప్పుడూ ఉండేది కాదు. ఆ విధంగా పార్టీలో పేరు ప్రతిష్ఠ ఆర్జించిన అతనికి 36సం॥లు వయసులో ఎమ్మెల్యే పదవిని పొందగలిగాడు. 2సం॥లు ఒక మామూలు ఎమ్మెల్యేలాగా వ్యవహరించి, శాసనసభ కమిటీల్లో చురుకుగా పాల్గొని, శాసనసభ కార్యక్రమాల్లో సజీవంగా పాలు పంచుకోవడం వల్ల, మూడో సంవత్సరంలో అతను మంత్రి పదవిని అధిరోహించడం జరిగింది. తరువాత ఎలక్షన్‌లలో గెలవడం, మంత్రిపదవిని పొందడం, అతనికి సులువైపోయింది. ఒక దశాబ్దం గడిచేసరికి ముఖ్యమంత్రి ఎవరైనా, ఉపముఖ్యమంత్రి మాత్రం సీతాపతిరావే అవడం రూఢి అయిపోయింది. అలా అని ఆధికారికంగా ఉపముఖ్యమంత్రి అనే పదవి ఏదీ సృష్టించబడలేదు. కానీ ముఖ్యమంత్రి యొక్క ప్రధాన ఉపదేష్ట ఎప్పుడైనా, వారి నంబరు 2 ఐన సీతాపతిరావే. ఈ కారణంవల్ల తక్కిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, సీతాపతిరావు పట్ల అపారమైన గౌరవాభిమానాలు కలిగి ఉండేవారు. ఇంతటితో సీతాపతిరావు గారి గౌరవప్రతిష్ఠల గూర్చి వివరణ ఆపేద్దాం.

ఇపుడు సీతాపతి గారి సీత, వాళ్ళ లవకుశులు...... వాళ్ళ సంగతి

పరిశీలిద్దామా?

ఆస్తి, అభిజాత్యం ఉన్న కుటుంబంలోనుంచి సీతాపతి అనే పతి తన సతిని ఎన్నుకున్నాడు. ఆమె పేరు చంద్రలేఖ. అతను మాత్రం ముద్దుగా 'లేఖా' అని పిలుస్తూంటాడు. పెళ్ళినాటికి ఆయనకి ఇరవై ఆరు, ఆమెకు ఇరవై. రెండు పంచవర్ష ప్రణాళికల కాలంలో వాళ్ళకు ముగ్గురు పిల్లలు కలిగారు. మొదట భార్గవరాముడు, మరో మూడేళ్ళలో ముద్దుల చెల్లాయి ఇందులేఖ పుట్టారు. ఇంకా పిల్లలు వద్దని సీతాపతి, చంద్రలేఖ సంకల్పించారు, కానీ, దానికి కావలసిన శస్త్రక్రియ చేయించుకోలేదు. ఐతే, ఆరు సంవత్సరాల తరువాత అరవిరిసిన దరహాసంతో ఒక చిన్నారి పాప, భూజాత అయ్యేటప్పుడు ఆ పాపకు 'పొరపాటమ్మ' అని పిలుద్దామని సీతాపతి తమాషాగా భార్యతో అన్నాడు. "ఏమండీ! ఆ పొరపాటు చిన్నపాప చెయ్యలేదే!" అని ఆమె అభ్యంతరం తెలిపింది. "రాత్రివేళల్లో నీ చంద్రిక దీప్తులు ఎక్కువ అవడంచేత నా వలన జరిగిన పొరపాటు ఇది. అందుకని కావాలంటే చంద్రిక అని పిలుద్దాం. కానీ ఒక్క విషయం నువ్వు పాటించాలి. రాత్రిళ్ళు బురఖా కప్పుకుని పడుకున్నావంటే పున్నమి చంద్రుడు కాకుండా, అమావాస్య చంద్రుడుగా మారి, నన్ను అల్లరి పెట్టకుండా ఉంటే చాలు". అని సీతాపతిరావు ఒక సుగ్రీవాజ్ఞ ఇవ్వడం జరిగింది.

సీతాపతి ఆరడుగుల మనిషి. ఆ ఎత్తుకు తగని లావేమి కాదు అతను. మొనదేరిన, పొడవైన నాసిక, దాని కింద ఠీవి ప్రదర్శించే మీసాలు, తీక్షణనేత్రాలు, చూసినవాళ్ళు అప్రయత్నంగా నమస్కరించేటంత ముఖవర్చస్సు, అమ్రిష్‌పురి గళం.

చంద్రలేఖ ఐదున్నర అడుగుల పొడవుండటం చేత, ఆమె ఒక మంచి పట్టుచీర కట్టుకుని వస్తే అలంకృతమైన ఏనుగులా ఉంటుంది. అలాగని చంద్రలేఖ ఏనుగులా స్థూలకాయురాలనీ కాదు, ముఖం మీద సిల్కుచీర ముక్క అడ్డం పెట్టుకుందనీ కాదు. అంతకన్నా మించి భర్తకు ఆమె ఒక తెల్లఏనుగై

కూర్చోలేదు. ఇందులో ఉద్దేశం.... ఆమె ఉత్కృష్టమైన అందానికి ఒక ఉపమానం మాత్రమే అని. చంద్రలేఖ మేనిఛాయ రాత్రుళ్ళే కాదు, పగలు కూడా మిరుమిట్లు కొలిపేటట్లు ఉంటుంది. "ప్రతీ ప్రసవంతో ఆమె సౌందర్యం ద్విగుణీకృతం అవుతోందని" చంద్రలేఖ భర్తకు తోచింది. భర్తకు, పిల్లలకు, ఎన్ని సేవలు చేసినా, ఆమెకు పూర్ణ సంతృప్తి కలిగేది కాదు. ఇంటిలో ఎంతమంది పనివాళ్ళున్నా వంటగదిలో ఆమే ప్రధాన వంటకత్తె, తోటలో ఆమే ప్రధాన తోటమాలి. గృహాలంకరణ విషయానికొస్తే ఏ మూలనున్న చిన్న చోటైనా వస్తువైనా, ఆమె దృష్టినుంచి తప్పించుకోలేదు. పిల్లల ఆరోగ్యం గురించి, వారి చదువుల గురించి ఆమెకు ఎక్కడాలేని శ్రద్ధా ఉండేది. రాష్ట్రరాజకీయాల్లో తలమునకలై ఉన్న భర్తకు, ఇంటి విషయాల్లో తలదూర్చడానికి సమయం ఉండదని ఆమె అర్థం చేసుకోలేదు.

చంద్రలేఖ కొడుకు భార్గవ రాముణ్ణి ఒక ఇంజనీరుగా తయారు చేసింది. అబ్బాయి చాలా మంచివాడే కానీ, కొంచెం కోపం ఎక్కువ. ఒక రాజకీయ నాయకుడి కొడుకు కావడం వల్ల, అందునా మంత్రి కుమారుడు అవడం చేత, అతని తలలో అధికార ఉన్మత్తత ప్రవేశించింది. అతని చుట్టూ ఎంతోమంది ఆరాధకులు, సమర్థకులు, మిత్రులు, సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాలు, ఉపగ్రహాలలాగే కాకుండా, ఉపద్రవాలుగా కూడా తిరిగేవాళ్ళు, ఆ వయస్సు యువకుడు ఆకాంక్షించే కంటే ఎక్కువగానే సుఖభోగాలు అతనికి పాదాభివందనం చేస్తున్నాయి. కరాటేలో 'బ్లాక్‌బెల్ట్' చేజిక్కించుకొన్న ఆ యువవీరుడికి ఎవరన్నా ఏదైనా కూడా భయం ఉండేది కాదు. కొట్లాటల్లో పాల్గోవడం అతని అభిమతం కాదు కానీ సందర్భం వస్తే వెనుకంజ వేయడం అతని మతం కాదు. ఒక పెద్ద ఫ్యాక్టరీ చేతిలోకి వచ్చినప్పటికీ, తండ్రిలాగా రాజకీయాల్లో రాణించాలనే బలవత్తరమైన కోరిక వెంటాడుతూ వచ్చింది. తన తండ్రి దైనందిన రాజకీయ కార్యకలాపాల్లో చేయూతనివ్వడం, ఎన్నికల్లో ఉద్యమ సారథ్యం వహించడం, అతనికి ఎంతో ప్రియమైన ప్రవృత్తి. ప్రతీ రాజకీయనేతకి, తనకంటూ ఒక

దాదాముఠా, లేదా ఒక రౌడీ గుంపు లేక మజిల్‌గ్రూప్ విధిగా ఉండాలని అతని అభిప్రాయం. అలాంటి ఒక బృందం అతనేం చేయమన్నా అది చేయడానికి, నిప్పుల్లో దూకమన్నా సరే దూకడానికి సిద్ధంగా అహరహం అతనికి అండగా ఉండేది. అప్పుడప్పుడు బీర్ తాగేవాడు కానీ, బ్రాందీ, విస్కీ, రమ్ము అతనికి రుచించేవి కాదు. అమ్మాయిలవేట కూడా అతనికి నచ్చదు. అతని జీవితంలో ఒకే ఒక పరమాశయం తన తల్లితండ్రుల, చెల్లెళ్ళ సుఖశ్రేయస్సులు.

ఇందులేఖ చూడటానికి చక్కనిదే కానీ, తల్లి సౌందర్యం ముందు దిగదుడుపే. అందుచేత ఆత్మన్యూనతాభావం నుంచి తప్పించుకోలేకపోయింది. ఆమె మేనిఛాయ కొంచెం తక్కువే. చిన్నప్పుడు కొంచెం బొద్దుగా ఉండే ఇందులేఖ, పెద్దదైన తరువాత మహాప్రయత్నాలు చేసినా కూడా డెబ్బైఐదు కిలోలకి ఇవతలకి రాలేకపోయింది. కొంచెం పొడగరి అయ్యుంటే ఫరవాలేదేమో! కానీ ఐదడుగులు దాటని ఆమెను మొదట చూసినవాళ్ళకు కూడా ఆమె లావు ఎక్కువగానే అనిపించేది. కొంచెం బిడియం ఎక్కువగానే ఉన్న ఆ అమ్మాయి, ఎవరితో కూడా ఎక్కువ మాట్లాడేది కాదు. ఆ ఇంటికి వచ్చే వాళ్ళందరు, ఆమె చెల్లెలు చంద్రిక యొక్క అందాన్ని గూర్చి ప్రశంసించేటప్పుడు, ఇందులేఖ అసూయ పడేది కాదు కానీ, తన గురించి కూడా ఎవరైనా రెండు మంచి మాటలు మాట్లాడితే ఎంతో బాగుంటుందని ఆమె ఆశించేది. తనకన్నా ఆరేళ్ళు చిన్నదైన చంద్రిక యవ్వన ప్రాప్తిఅనంతరం తల్లిని మించిన సౌందర్యరాశి అవుతుందని తలచుకుంటే ఆమెకు రోమాంచం కలిగేది కానీ, ఆ భగవంతుడు తనపై ఇంకొంచెం దయ ఎందుకు చూపించలేదని ఆమె బాధపడేది. ఇలాంటి అపకర్షతాభాం ఆమెను వెంటాడటం వల్ల, చదువు మీద పూర్తిగా మనసు లగ్నం చేయలేకపోయింది. సంగీతంలో అభినివేశం ఉన్న ఆమె మూడు నాలుగేళ్ళు పాటు కర్ణాటక సంగీతాన్ని అభ్యసించింది. హిందీ సినిమా పాట రెండు సార్లు వింటేచాలు ఆమెకు వంటబట్టేస్తుంది. చిన్నమ్మాయికి మాత్రం ఇంగ్లీషు పాటలంటే ప్రీతి. చంద్రిక కొంతకాలం నుంచీ భరతనాట్యం అభ్యసిస్తుంది.

ఆమె వేదిక ఎక్కి నాట్యంచేస్తే యువప్రేక్షకులకు కొద్ది రోజులపాటు సరిగా నిద్రపట్టదేమో అని ఇందులేఖ అనుకుంటూ ఉంటుంది.

సీతాపతిరావు గారికి భార్యాబిడ్డల పట్ల ఎంతప్రేమో, అంతే ప్రేమ.... బహుశా కొంచెం ఎక్కువే ...... రాజకీయ జీవితం పట్ల కూడా ఉంది. రాజకీయమూ, అధికారమూ అతనికి ఒకరకమైన మత్తు. ఆయనకు రోజు రోజుకి జనాదరణ పెరుగుతూనే వచ్చింది. పాపం, ఉదయం నాలుగు, నాలుగున్నరకి ఆయన లేస్తాడు. అప్పటికే, భక్తకోటి వాకిట్లో పడిగాపులు కాస్తూ ఉంటుంది. టెలిఫోను పరంపరల బెడద కూడా దానితోపాటు మొదలవుతుంది. రాత్రి దాదాపు ఒంటిగంట దాకా అతనికి విశ్రాంతి దొరికేది కాదు. ఆ విషయం గురించి అతని భార్యామణి ఏదైనా అభ్యంతరం తెలిపితే, "లేఖా! మానవుడు ఏదైనా సాధించడానికి పూనుకున్నట్లైతే దానికి ఏదో ఒక రూపంలో మూల్యం చెల్లించకతప్పదు. మన ఇంటిముందు కనిపిస్తున్న కార్యకర్తలు ముఖ్యమంత్రి ఇంటిముందు కనిపిస్తారా నీకు? ఆ మాటకొస్తే నేనేదైనా ఒక విషయం, చీఫ్ సెక్రటరీతో గానీ, డి.జి.పితోగానీ చెప్తే, అది ముఖ్యమంత్రికి అహితకరమైన కార్యమైనా కూడా వాళ్ళు తప్పకుండా చేసి పెడతారు. నా వెనుక ఎంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారో నీకు తెలుసా? చాలామంది ప్రతిపక్షం వాళ్ళకి కూడా నేనంటే ఇష్టమే. వీళ్ళందరికీ నా సమయంలో కొంచెం కేటాయించాలి కదా! కానీ, ఒకటి, వాళ్ళకు నేనిచ్చేది ఒక సమయం మాత్రమే. నా మనసెపుడూ మీ దగ్గరే ఉంటుంది కదా! మన పిల్లల భవిష్యత్తు గూర్చి దైవప్రార్థన చేస్తూ అది ఎల్లప్పుడూ ఈ ఇంటిలో నిండి ఉంటుంది. వీలున్నప్పుడంతా నేను నీతో ఫోనులో మాట్లాడుతునే ఉన్నాను కదా! నేనెక్కడున్నా, ఎంతపనిలో తలమునకలవుతున్నా, నిన్ను గానీ పిల్లలను కానీ ఒక్కక్షణం కూడా విస్మరించను. నా ఈ యాతనలన్నీ మీ కోసమే. నేను బతికేదే మీ కోసం" అని ఎంతో శాంతస్వరంతో ఆయన అంటారు.

"మీ జీవితం దరిద్రనారాయణుల సేవకు అంకితం అని, మీ ఆఖరి రక్తపుబొట్టు కూడా దేశసేవకే దత్తం అనీ ఉపన్యాసాలిస్తూ ఉంటారే?" అంటూ చంద్రలేఖ సీతాపతి రావుగారి బుగ్గ చిదిమింది.

"అక్కడ ఆ కథలు చెప్పడం కూడా మీ కొరకే కదా!"

ఏమైనా కూడా ఒక విషయం మాత్రం చాలా స్పష్టం సీతాపతికి ఒకే ఒక అత్యాశ ఉంది. అది ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోవాలని. దాని కోసం, గ్రూపులు, కులాలు, ప్రాయవ్యత్యాసాలు చూడకుండా అందరి ప్రీతి పొందడానికి అతను భగీరథ ప్రయత్నం చేస్తూ వచ్చాడు. అదే సమయంలో ఈ విషయం గూర్చి ముఖ్యమంత్రికి అనుమానం కలగకుండా జాగ్రత్తపడ్డాడు. భరణ యంత్రాంగంలో ముఖ్యమంత్రికి ద్వితీయుడుగా, వారి బహిఃప్రాణంగా వర్తిస్తూ, శాసనసభల్లో, బహిరంగ సభలలో కూడా అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను సమర్థిస్తూ సీతాపతి ముఖ్యమంత్రికి మాత్రం కాక మంత్రిమండలికి మాత్రం కాక, అధికార పక్షానికి మాత్రం కాక యావత్ రాష్ట్ర పురోగతికొరకై అనివార్యమైన ఒక శక్తిదుర్గం లాగా తయారయ్యాడు. తన పరమవాంఛ సాక్షాత్కారానికి, రాజకీయ రంగంలో కింది స్థాయి నుంచి ఉన్నతస్థాయి ఉన్న పార్టీ కార్యకర్తల మద్దతు ఆర్జించడానికి ఆయన అనుక్షణం తాపత్రయపడుతూ వచ్చారు.